


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శుక్రవారం 13-6-2025

సంపుటి: 21 సంచిక: 69
పేజీలు: 8 వెల: రూ.1

- డీఈవో ఆదేశాలు తమకు వర్తించవని వాదన
- ఇతర యాజమాన్య పాఠశాలలకు వెళ్లేందుకు ససేమిరా
- వారి నిర్వాకంతో చాలా ఖాళీగా టీచర్ పోస్టులు
- ఇచ్ఛాపురం నుంచి మూకుమ్మడిగా ఆమదాలవలసకు బదిలీలు
- ఆ నియోజకవర్గంలో పాఠాలు చెప్పేవారు కరువు




## మున్సిపల్ టీచర్ల బెట్టు
# నిబంధనలు తీసికట్టు!

"జిల్లాలో ఏ ఒక్క పాఠశాలలో కూడా ఉపాధ్యాయులు లేరు (సబ్జెక్ట్ ఉపాధ్యాయులతో సహా) అనే మాట రాకూడదు. పాఠశాల నుంచి ఎంతమంది బదిలీపై వెళ్తున్నారు.. వారి స్థానంలో ఎంతమంది కొత్తగా జాయినవ్వాలన్న విషయాన్ని సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈరోజే అంచనా చేసుకోవాలి. రేపటికి ఏ పాఠశాలలో కూడా ఉపాధ్యాయులు లేరు అనే మాట రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారిదే. నూతన పాఠశాలల్లో జాయిన్ కావాల్సిన వారు తమ స్థానంలో రిలీవర్ వచ్చేవరకు పని చేయాలన్న దానిపై కొన్ని సూచనలు పంపుతున్నాం."

..ఇదీ పాఠశాలల పునఃప్రారంభానికి ముందురోజు జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య అన్ని మండలాల ఎంఈవోలకు, ప్రధానోపాధ్యాయులకు పంపిన వాట్సాప్ సందేశం. అయితే గురువారం పాఠశాలలు పునఃప్రారంభమైనా అనేక చోట్ల ఉపాధ్యాయులు లేకుండానే తరగతులు జరిగాయి. కారణం.. ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్‌లో బదిలీలకు అర్హతలున్నవారందరూ దూరప్రాంతాల నుంచి దగ్గరి ప్రాంతాలకు ఆప్షన్ ఇచ్చి వెళ్లిపోవడంతో మారుమూల ప్రాంతాల్లోని అనేక పాఠశాలలకు ఉపాధ్యాయులు లేకుండాపోయారు. అసలు ఈ బదిలీల ఉద్దేశమే ఉపాధ్యాయుడు లేని పాఠశాల ఉండకూడదని, ప్రాథమిక పాఠశాలల్లో కనీసం 50 శాతం మంది ఉపాధ్యాయులు ఉండాలని, ఎక్కడైనా ఒక పాఠశాలలో మొత్తం ఉపాధ్యాయులు బదిలీ అయితే వారిలో 50 శాతం నిష్పత్తి మేరకు జూనియర్లు మళ్లీ అదే పాఠశాలలో రిపోర్ట్ చేయాలన్న నిబంధన ఉంది. అలాగే హైస్కూళ్లలో సబ్జెక్ట్‌కు ఒక ఉపాధ్యాయుడు కచ్చితంగా ఉండాలని కూడా ప్రభుత్వం పేర్కొంది. దీన్ని జిల్లాపరిషత్ యాజమాన్యంలోని పాఠశాలల్లో పాటించినా మున్సిపాలిటీల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు మాత్రం పెడచెవిన పెట్టారు. ఫలితంగా ప్రస్తుతం జిల్లాపరిషత్, మున్సిపల్ పాఠశాలల యాజమాన్యాల మధ్య కోల్డ్‌వార్ నడుస్తోంది.

సత్యంన్యూస్, శ్రీకాకుళం

### డీఈవో పరిధిలోనే అన్ని పాఠశాలలు

సాధారణంగా మూడు రకాల పాఠశాలలు ఉంటాయి. ఒకటి గవర్నమెంట్, రెండు జిల్లాపరిషత్, మూడు మున్సిపాలిటీ ఆధీనంలో నడిచే పాఠశాలలు. కొన్నేళ్ల క్రితం వరకు మున్సిపల్ పాఠశాలలకు సంబంధిత మున్సిపల్ కమిషనరే బాస్‌గా ఉండేవారు. కానీ తర్వాత ప్రభుత్వం పాఠశాలలన్నీ ఒకే గొడుగు కింద పని చేయాలన్న ఉద్దేశంతో డీఈవోల పరిధిలోకి తీసుకొచ్చింది. ఫలితంగా బదిలీలకు ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాలు, నిబంధనలు అన్ని యాజమాన్యాల పాఠశాలలకు వర్తిస్తాయి. ఆమధ్య విద్యార్థులున్నచోట ఉపాధ్యాయులు లేరని తేలడంతో మేనేజ్‌మెంట్‌తో సంబంధం లేకుండా జిల్లాపరిషత్ పరిధిలో ఉన్న టీచర్లను మున్సిపల్ పాఠశాలలకు పంపి పని చేయించారు. కానీ ఇప్పుడు బదిలీల వద్దకు వచ్చేసరికి ఒక మున్సిపాలిటీ నుంచి మరో మున్సిపాలిటీకే ఆప్షన్ ఇచ్చి బదిలీ అయిన టీచర్లు కొన్ని స్కూళ్లలో సబ్జెక్ట్ టీచర్లు లేకుండాపోయారని తెలిసినా వెనక్కు రావడానికి ఇష్టపడటంలేదు. ఇదేమని ప్రశ్నిస్తే తాము మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్నందున డీఈవో ఆదేశాలు చెల్లవంటున్నారు. వాస్తవానికి వీరంతా విద్యాశాఖ ఆర్‌జేడీ పరిధిలోనే ఉన్నారు. సర్దుబాటులో భాగంగా జిల్లాపరిషత్ టీచర్లు మున్సిపాలిటీలో కొన్నాళ్లు పని చేసినప్పుడు వర్తించిన నిబంధనలు ఇప్పుడు వర్తించవనడం ఏమేరకు సబబనే ప్రశ్న తలెత్తుతోంది.

### నష్టపోతున్న ఇచ్ఛాపురం నియోజకవర్గం

ముఖ్యంగా ఇచ్ఛాపురంలో పని చేస్తున్న ఉపాధ్యాయులు నిన్నటి బదిలీల్లో ఆమదాలవలసకు క్యూ కట్టారు. జిల్లాకు, రాష్ట్రానికి శివారున ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి చాలామంది టీచర్లు ఏదో ఒక కారణంతో జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం సమీపానికి వచ్చేశారు. దీంతో ఈ నియోజకవర్గంలోని కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకుండాపోయారు. ఐదు పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు, ఎనిమిది సబ్జెక్టులకు టీచర్లు లేకుండానే గురువారం పాఠశాలలు రీ ఓపెన్ అయ్యాయి. పొలోమంటూ ఇచ్ఛాపురం నుంచి ఆమదాలవలసకు వచ్చేసిన వారిలో కొంతమంది మళ్లీ ఇచ్ఛాపురానికి రీబ్యాక్ అవ్వాలి. అలాగే ఆమదాలవలస నుంచి పదోన్నతిపై ఇచ్ఛాపురం వెళ్లాల్సినవారు కూడా వెళ్లలేకపోతున్నారు. ఇచ్ఛాపురం జీహెచ్ఎస్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్లు ఐదుగురు ఉండాలి. ప్రస్తుతం ఈ ఐదూ ఖాళీగానే కనిపించాయి. అలాగే ఇంగ్లీష్‌కు ఐదుగురు ఉండాల్సి ఉండగా ఇద్దరే ఉన్నారు. మ్యాథ్స్‌లో ఐదుగురికి గాను ముగ్గురే ఉన్నారు. ఇది ఎవరో చెబుతున్న మాట కాదు. స్వయంగా ఉపాధ్యాయ సంఘాల వాట్సప్ గ్రూపుల్లో సంఘ నేతలే ఈ పద్ధతి సరికాదంటూ పెడుతున్న సమాచారం. ఇచ్ఛాపురం పక్కనున్న రత్తకన్నలో తెలుగు బోధించే ఇద్దరు ఉపాధ్యాయులు ఆమదాలవలస వెళ్లిపోయారు. వీరిలో ఒక జూనియర్ వెనక్కు రావాలి. కానీ అలా జరగలేదు. ఇచ్ఛాపురం మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్ నుంచి వెళ్లిపోయిన తెలుగు టీచర్ ఒకరు వెనక్కు రావాలి. అదీ జరగలేదు. పురుషోత్తపురం మున్సిపల్ స్కూల్

- మిగతా చివరి పేజీలో

# వందేళ్ల స్ఫూర్తి.. తరగని సేవా దీప్తి

సౌకర్యాల లేమి.. పరిమిత ఆర్థిక వనరులు.. వంటి అనేక అవరోధాల నడుమ పూర్వకాలంలో విద్యాభ్యాసం కష్టతరంగా ఉండేది. రవాణా వసతులు అంతంతమాత్రంగా ఉన్న ఆ కాలంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల్లోని విద్యాసంస్థలకు వెళ్లి చదువుకోవడం పేదవర్గాలకు దాదాపు అసాధ్యం. దీన్ని దృష్టిలో ఉంచుకునే అప్పట్లో సంపన్నవర్గాలకు చెందిన అనేకమంది దాతలు సొంత వనరులతో సత్రాలు ఏర్పాటు చేసి అన్నదానం చేసేవారు. వారి దాతృత్వం ఎంతోమందిని విద్యావంతులుగా.. ఉన్నతోద్యోగులుగా తీర్చిదిద్దింది. అటువంటి దాతృత్వానికి ప్రతీక నేటికీ పాలకొండలో సజీవంగా కనిపిస్తుంది. వందేళ్లు పూర్తి చేసుకున్నా ఇప్పటికీ దూరప్రాంత విద్యార్థుల కడుపు నింపుతూ స్ఫూర్తి పరిమళాలు వెదజల్లుతోంది. తమ పూర్వీకులు వెలిగించిన ఈ స్ఫూర్తి దీప్తి మలిగిపోకుండా వారి వారసులు ఇప్పటికీ చేతులు అడ్డం పెట్టి కాపాడుతున్నారు. శిథిలమైన భవనాన్ని పునరుద్ధరించడంతోపాటు ప్రస్తుత కాలానికి అనుగుణంగా దాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంగా మార్చుందుకు ప్రయత్నిస్తున్నారు.

- అసిధారా వ్రతంలా నిరంతరాయంగా నిర్వహణ
- బెవర గోపాలనాయుడు చొరవతో ఏర్పాటు
- తొలుత బాటసారులకు.. తర్వాత దూరప్రాంత విద్యార్థులకు ఆదరువు
- దాన్ని ఇప్పటికీ కొనసాగిస్తున్న ఆ కుటుంబ వారసులు
- మధ్యలో కొన్నేళ్లు దేవదాయ శాఖ ఆధీనంలో నిర్వహణ
- మళ్లీ ఇప్పుడు వారసులకే ఆ బాధ్యతలు అప్పగింత
- అన్నదాన సత్రం వ్యవహారాల్లో శశిభూషణరావుదే కీలకపాత్ర





డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి

వందేళ్ల క్రితం.. రవాణా సౌకర్యాలు ఇప్పటిలా విస్తృతంగా లేవు. విద్యాసంస్థలు కూడా విస్తరించ లేదు. ఎక్కడో పట్టణ ప్రాంతాల్లో తక్కువ సంఖ్యలోనే ఉండేవి. ఫలితంగా గ్రామాల నుంచి విద్యాసంస్థలు ఉన్న ప్రాంతాలకు వెళ్లి, అక్కడే ఉండి చదువుకోవడం అందరికీ, ముఖ్యంగా పేదలకు సాధ్యమయ్యేది కాదు. అక్కడక్కడా దాతలు నిర్వహించే అన్నదాన సత్రాలు మాత్రం కొంతవరకు ఆదరువుగా ఉండేవి. ఆ కోవకు చెందినదే పాలకొండ పట్టణంలోని ముదునూరువారి వీధిలో ఉన్న బెవర గోపాలనాయుడు అన్నసత్రం. గత ఏడాదే వందేళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్న ఈ సత్రం నేటికీ సేవలు అందిస్తోంది. వ్యవస్థాపకులు మరణిం చినా ఆ కుటుంబంలోని తర్వాత తరాల వారు ఈ దాతృత్వ యజ్ఞాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. మధ్యలో కొన్నేళ్లు దేవదాయ శాఖ ఈ సత్రాన్ని స్వాధీనం చేసుకున్నా.. చివరికి మళ్లీ వ్యవస్థాపక కుటుంబానికి దాని నిర్వహణ బాధ్యతలు దక్కాయి. ఒకప్పుడు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పాలకొండ తాలూకా కేంద్రంగా ఉండేది. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తమ అవసరాలన్నింటికీ ఈ పట్టణానికే వచ్చే వారు. అలాగే ఉన్నత పాఠశాల కూడా ఇక్కడే ఉండేది. దాంతో చాలా ప్రాంతాల విద్యార్థులతోపాటు ప్రజలు వివిధ పనులపై నిత్యం పాలకొండకు వచ్చే వారు. అయితే వందేళ్ల క్రితం ఈ ప్రాంతాలు తీవ్ర కరువుకాటకాలతో అల్లాడేవి. దాంతో విద్యార్థులు, బాటసారులు నానా ఇబ్బందులు పడేవారు. ఈ పరిస్థితులను గమనించిన ఒక భూస్వామి చలించిపో యారు. ఆపన్నులను ఆదుకునేందుకు ఏదైనా చేయాలని తపించారు. అతనే వీరఘట్టం మండలం నీలానగరానికి చెందిన బెవర గోపాలనాయుడు. ఆయన తపన నుంచి పుట్టిందే బెవర గోపాల నాయుడు అన్నదాన సత్రం. ఇప్పటికీ ఆ కుటుంబ దాతృత్వానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.

### తరతరాలుగా సేవలు

ఉత్తరాంధ్రలో దాతృత్వానికి మారుపేరుగా నిలిచిన సంస్థ.. విజయనగరం రాజవంశానికి చెందిన మన్సాస్ ట్రస్ట్. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అప్పటి వరకు ఉన్న సంస్థానాల విలీన ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. ఆ పరిణామాల నేపథ్యం లో 1958లో విజయనగరం పూజపాటి రాజావారు తమ సంస్థానానికి చెందిన భూములను విరాళంగా ఇచ్చి మన్సాస్ ట్రస్ట్ పేరుతో ధార్మిక సంస్థను ఏర్పాటు చేశారు. కానీ దానికి దాదాపు పాతికేళ్ల ముందే..1924 మార్చిలో బెవర గోపాలనాయుడు తొలుత దూరప్రాంతాల నుంచి వచ్చే బాటసారుల కోసం అన్నదాన సత్రాన్ని ఏర్పాటు చేశారు. దీని నిర్వహణ కోసం నీలానగరం, తెట్టంగి, లుంబూరు గ్రామాల్లో తమ కుటుంబానికి ఉన్న 50 ఎకరాల భూములను విరాళంగా ఇచ్చారు. తర్వాత ఆయన కుమారుడు బెవర వేణుగోపాలనాయుడు పణుకు



వలసలో 20 ఎకరాల భూములను విరాళంగా ఇచ్చారు. నాగావళి ఆయకట్టు పరిధిలో ఉన్న ఈ భూములన్నీ ఏడాదికి మూడు పంటలు (రెండు వరి, ఒక అపరాలు) పండేవే. పాలకొండకు వివిధ పను లపై వచ్చే బాటసారుల ఆకలి తీర్చే క్రతువు ప్రారం భించిన గోపాలనాయుడు, భూముల నుంచి వచ్చే ఆదాయం మిగులుతుండటంతో చదువుకునేందుకు గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు కూడా ఆ సౌక ర్యాన్ని విస్తరింపజేసి.. వారి ఆకలి తీర్చడం ప్రారంభిం చారు. ఆ విధంగా ప్రతిరోజు సుమారు 80 మంది విద్యార్థులకు పగలు, రాత్రి.. రెండు పూటలా భోజనం పెట్టేవారు. ఆహారం మిగిలిపోతే ఉదయం చద్దన్నంగా కూడా పెట్టేవారు. గోపాలనాయుడు తదనంతరం కుమారుడు వేణుగోపాలనాయుడు దాన్ని కొనసాగిం చారు. ఈయనకు పిల్లలు లేరు. దాంతో వ్యవస్థాపకు డైన గోపాలనాయుడు సంతానమైన ఆరుగురు కుమార్తెల వారసులు అన్నదాన సత్రం నిర్వహణ బాధ్యతలు కొనసాగించారు. గోపాలనాయుడు ముని మనుమడైన డాక్టర్ పాలవలస శశిభూషణరావు గత కొన్నేళ్లుగా ఈ సత్రం బాగోగులు, నిర్వహణ చూస్తున్నారు.

### ప్రభుత్వం స్వాధీనం.. నిర్వహణ లోపం

గోపాలనాయుడు తదనంతరం ఆయన తనయుడు వేణుగోపాలనాయుడు సత్రం నిర్వహణ బాధ్యతలు చూశారు. అద్దె ఇంట్లో నిర్వహిస్తున్న సత్రానికి ఆయనే పాలకొండ పట్టణంలోని ముదునూరువారి వీధిలో సొంత గూడు సమకూర్చారు. 1949లో వేణుగోపాల్ మృతి చెందారు. దానికి ముందే ఆయన సత్రం నిర్వ హణ బాధ్యతలను తమ కుటుంబ వారసులు, గ్రామ పెద్దలతో ఏర్పాటు చేసిన కమిటీకి అప్పగించారు. అప్పటినుంచి కమిటీఆధ్వర్యంలో సత్రాన్ని నిర్వహిస్తూ అన్నదానం నిరంతరాయంగా కొనసాగించారు. అయితే 1975 ప్రాంతంలో ప్రభుత్వం దీన్ని స్వాధీనం చేసు కుంది. అప్పటినుంచి చాలా ఏళ్లు దేవదాయ శాఖ దీన్ని నిర్వహించింది. అయితే కాలక్రమంలో వసతు లు పెరగడం, రోడ్డు రవాణా సౌకర్యాలు విస్తరిం చడం, స్కూళ్లు కళాశాలలు ఎక్కడికక్కడ ఏర్పాటు కావడం, విద్యార్థుల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లు ఏర్పాటు చేసి ఉచిత భోజన వసతి కల్పించడంతో గోపాలనాయుడు సత్రానికి విద్యార్థుల రాక క్రమంగా తగ్గిపోయింది. అయినా ఇప్పటికీ రోజూ పది పదిహేను మంది విద్యార్థులు వస్తున్నారు. మరోవైపు దేవదాయ శాఖ అధికారుల నిర్వహణ లోపం వల్ల 2018 నాటికి సత్రం శిథిలావస్థకు చేరుకుంది. దాంతో చాన్నాళ్లు కోటదుర్గ గుడి ఆవరణలోనే ఈ సత్రానికి వచ్చే విద్యార్థులకు అన్నదానం చేసేవారు.

### కొత్త భవనం నిర్మాణం

సత్రం దేవదాయ శాఖ చేతిలోకి వెళ్లడం, విద్యా ర్థుల సంఖ్య తగ్గడం, నిర్వహణ లోపం తదితర కారణాలతోపాటు సత్రం నిర్వహణకు వ్యవస్థాపకులు ఇచ్చిన భూములు చాలావరకు అన్యాక్రాంతమయ్యా యి. రావాల్సిన ఆదాయం కూడా రాని పరిస్థితులు తలెత్తాయి. భవనం శిథిలమైంది. ఈ పరిస్థితులను గమనించిన బెవర గోపాలనాయుడి వారసుల్లో కీలక పాత్ర పోషిస్తున్న డాక్టర్ పాలవలస శశిభూషణరావు సత్రం బాధ్యతలు తిరిగి తమకే అప్పగించాలని కోరుతూ ప్రభుత్వంతో సంప్రదింపులు ప్రారంభించారు. అలాగే శిథిల భవనం స్థానంలో కొత్త భవన నిర్మించాలని కోరారు. ఆయన కృషి ఫలితంగా అప్పటి దేవదాయ కమిషనర్ అనిల్‌కుమార్ సింఘాల్ చొరవతో కొత్త భవనానికి ఆమోదం లభించింది. అయితే నిర్మాణ వ్యయంలో ఐదో వంతు విరాళంగా ఇస్తే.. మిగిలిన వ్యయాన్ని ప్రభుత్వ నిధులతో భరిస్తామని సింఘాల్ షరతు పెట్టారు. దానికి అంగీకరించిన శశిభూషణ రావు కుటుంబమంతా కలిసి భవన నిర్మాణ వ్యయం రూ.30 లక్షల్లో

- మిగతా చివరి పేజీలో

• ఎడిటోరియల్

# ప్రధాన పార్టీలకు కోవర్టుల బెడద?

రాజకీయంగా ఎదగాలన్నా.. ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టాలన్నా.. వ్యూహ ప్రతివ్యూహాలు, ఎత్తులు పైఎత్తులు తప్పవు. తమ బలాన్ని పెంచుకోవడం, ఎదుటివారి బలహీనతలను గుర్తించడం, ప్రత్యర్థి పార్టీల గుట్టుమట్లు, వ్యూహాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ప్రతివ్యూహాలు పన్నడం రాజకీయాల్లో సహజం. సమకాలీన రాజకీయాల్లో దాదాపు అన్ని పార్టీలూ తమ ప్రత్యర్థుల లోగుట్ట తెలుసుకుని దెబ్బకొట్టడానికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రాంతీయం నుంచి జాతీయం వరకు ప్రధాన పార్టీలను కలవరపెడుతున్న అంశం కూడా అదే. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఇప్పుడు ఇదే చర్చనీయాంశం. ఏ పార్టీలో ఎవరి కోవర్టులు ఉన్నారో తెలియని గందరగోళ పరిస్థితులు నెలకొనడమే దీనికి కారణం. చిన్నాచితకా నాయకులు మాట్లాడేదైతే పెద్ద సీరియస్‌గా పరిగణించాల్సిన అవసరం ఉండేది కాదేమో. కానీ రాహుల్ గాంధీ నుంచి చంద్రబాబు, కేటీఆర్ వరకు దాదాపు బడానేతలందరూ ఈ విషయాన్ని నొక్కి వక్కాణించడమే కోవర్టు రాజకీయంపైకి దృష్టి మళ్లించేలా చేస్తోంది. ప్రాంతీయ పార్టీల నుంచి జాతీయ పార్టీల వరకు ప్రతి రాజకీయ పక్షాన్ని కోవర్టుల సమస్య బాధిస్తున్నట్లు స్పష్టమవుతోంది. అయితే ఏ పార్టీకి ఎవరు.. ఎక్కడ కోవర్టులుగా పనిచేస్తున్నారని తెలుసుకోవడమే పెద్ద సవాలుగా మారింది. రాష్ట్ర ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడే స్వయంగా తమ పార్టీలో కోవర్టులపై ఇటీవల చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి. హత్యా రాజకీయాల్లో తలపండిన వైకాపా నాయకులు కొందరు కోవర్టులను తెలుగుదేశంలోకి పంపి తాము అనుకున్నది సాధించాలని అనుకుంటున్నారంటూ బాంబు పేల్చారు. అలాంటివారిని ఉపేక్షిస్తే మన వేలితో మన కన్ను పొడుచుకున్నట్టేనని కార్యకర్తలను హెచ్చరించారు. టీడీపీనే కాదు.. కొత్తగా ఏర్పడిన తెలంగాణలో పదేళ్లు అధికారం చెలాయించిన బీఆర్ఎస్‌ను కూడా ఇప్పుడు కోవర్టుల భయం వెంటాడుతోంది. ఇటీవల ఆ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కవిత రాసిన అంతర్గత లేఖ లీకవడంతోనే ఆ పార్టీలో కోవర్టుల పాత్ర తెరపైకి వచ్చింది. అంతర్గత లేఖ బయటకెలా వచ్చిందో తేల్చాలని కవిత డిమాండ్ చేయగా, పార్టీలో సీఎం రేవంత్‌రెడ్డి కోవర్టులు ఉన్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సమయం వచ్చినప్పుడు ఆ కోవర్టుల బండారం బయటపడుతుందని హెచ్చరించారు. అయితే ఆలోపు ఇంకెన్ని బీఆర్ఎస్ సీక్రెట్స్ బయటకు వస్తాయోనని క్యాడర్ ఆందోళన చెందుతోంది. కేటీఆర్ చెప్పిన దాంట్లో వాస్తవం లేకపోలేదు. ప్రతి పార్టీలోనూ కోవర్టులు ఉంటారు. అక్కడి అంతర్గత విషయాలను తమ బాసులకు చేరవేస్తుంటారు. అదే క్రమంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్‌లో సైతం బీఆర్ఎస్, బీజేపీల కోవర్టులు ఉన్నారనే ప్రచారం చాన్నాళ్ల నుంచీ ఉంది. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండగా వరంగల్ సభలో ఏకంగా రాహుల్ గాంధీయే ఈ విషయాన్ని ప్రస్తావించారు. అలాంటి వారు ఎవరైనా, ఎంతటివారైనా తమకు అక్కర్లేదనీ, సొంత పార్టీల్లోకి వెళ్లిపోవాలని తేల్చి చెప్పేశారు. కోవర్టులతో చాలా ఏళ్లు ఇబ్బంది పడిన తెలంగాణ కాంగ్రెస్‌కు అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా ఇంకా ఆ బెడద పోలేదని తెలుస్తోంది. జాతీయ స్థాయిలోనూ ఆ పార్టీకి కోవర్టుల సమస్య వెంటాడుతోంది. ఇటీవల గుజరాత్‌లో జరిగిన పార్టీ ముఖ్యనేతల సమావేశంలోనూ రాహుల్ ఇదే విషయాన్ని ప్రస్తావించారు. కాంగ్రెస్‌లో సగం మందికిపైగా బీజేపీకి కోవర్టులుగా పనిచేస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అన్ని పార్టీల్లోనూ కోవర్టులు ఉన్నప్పటికీ.. కాంగ్రెస్‌లో మాత్రం ఈ సంస్కృతి ఎప్పటి నుంచో ఉందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలో లేనప్పుడు ఆ పార్టీ నేతలు తమ పనుల కోసం అధికారపక్షాలతో అంటకాగుతుంటారనే ఆరోపణ ఉంది. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చాలా మంది కాంగ్రెస్ నేతలు ఇలాంటి ఆరోపణలే ఎదుర్కొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్‌లోనే ఉంటూ సొంత పార్టీ నేతలనే ఓడించుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఎంపీ ఈటల రాజేందర్‌పై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను తిప్పికొడుతున్న బీజేపీ.. అసలు కోవర్టులు కాంగ్రెస్‌లోనే ఉన్నారని, వారంతా బీఆర్ఎస్ కోసం పనిచేస్తున్నారని ప్రత్యారోపణలు చేస్తోంది. కేసీఆర్‌కు అనుకూలంగా పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ కోవర్టు రాజకీయాలు చేస్తున్నారని బీజేఎల్పీ లీడర్ మహేష్ గౌడ్ ఆరోపించారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కవితకు మద్దతు ఇచ్చారని ఆరోపించారు. మొత్తం మీద అధికారంలో ఉన్నా లేకపోయినా.. ప్రధాన రాజకీయ పార్టీలను ఇప్పుడు కోవర్టుల అంశం కుదిపేస్తున్నట్లు కనిపిస్తోంది.



ఆమదాలవలస నియోజకవర్గంలో ఆమదాలవలస పట్టణంలో ఉన్న టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి పలు ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంబంధిత శాఖల అధికారులు కూడా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆదేశించారు.

**- సత్యంన్యూస్, ఆమదాలవలస**

## 14న ఉత్తరాంధ్ర గ్రంథాలయ సదస్సు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



గ్రంథాలయ పునర్వికాస ఉద్యమంలో భాగంగా ఈనెల 14వ తేదీన విశాఖ పౌర గ్రంథాలయంలో ఉత్తరాంధ్ర ప్రాంతీయ సదస్సు జరుగుతుందని జిల్లా కన్వీనర్ బుడుమూరు సూర్యారావు, కో కన్వీనర్ డాక్టర్ జామి భీమశంకర్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే సదస్సుకు ద్రవిడ విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె ఎస్ చలం అధ్యక్షతన జరిగే ఈ సదస్సుకు,రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ సమన్వయకర్తగా వ్యవహరిస్తారని తెలిపారు. ఆచార్య చలంతోపాటు మరో ఐదుగురు పూర్వ వైస్ ఛాన్సలర్లు సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.జి. నాగేశ్వరరావు(ఆంధ్ర విశ్వవిద్యాలయం), ఆచార్య సుదర్శన్ రొక్కం (విక్రమ్ సింహపురి విశ్వవిద్యాలయం) , వై. సత్యనారాయణ ( దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం), ఎం. ముత్యాల నాయుడు ( ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం), డాక్టర్ హెచ్. లజపతిరాయ్ ( బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం) ముఖ్య అతిథులుగా హాజరవుతారని వివరించారు. ప్రజాశక్తి బుక్ హౌస్ ఎడిటర్ ఎం వి ఎస్ శర్మతో పాటు, సాహిత్యం, జర్నలిజం, గ్రంథాలయ ఉద్యమం వంటి రంగాలకు సేవ చేసిన ప్రముఖులు హాజరవుతారన్నారు.

## తల్లికి వందనంలో కోత విధించటం సిగ్గు చేటు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎన్నికల సమయంలో చదువుతున్న ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం నేడు పాఠశాల అభివృద్ధి పేరుతో రూ.2వేల కోతపెట్టడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చందు విమర్శించారు. ఈమేరకు శుక్రవారం సూర్యమహల్ జంక్షన్ నుండి ఏడురోడ్ల కూడలి వరకు 200 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులు ఈ ప్రభుత్వం ఇచ్చే రూ.15 వేలు విద్యార్థుల విద్యకు ఉపయోగపడతాయని, అదేవిధంగా ప్రైవేట్ విద్యాసంస్థలలో ఫీజులు కట్టడానికి దోహదపడతాయని భావించారన్నారు. కాని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి తల్లి అకౌంట్లో డబ్బులు పడతాయని చెప్పి ఆ సంతోషం అరక్షణం కూడ ఉండనివ్వకుండా కుటుంబ ఆదాయం గ్రామాల్లో నెలకు రూ.10వేలు, పట్టణాల్లో రూ.12వేల లోపు ఉండాలని, రైస్‌కార్డు ఉండాలని, ఫ్యామిలీకి 3 ఎకరాల్లోపు మాగాణి, లేదా 10 ఎకరాల్లోపు పొడిభూమి, లేదా రెండూ కలిపి 10 ఎకరాల్లోపు ఉండాలని, ట్యాక్సీ, ట్రాక్టర్, ఆటో సహా ఎలాంటి ఫోర్ వీలర్స్ ఉండకూడదని, కరెంట్ బిల్ నెలకు 300 యూనిట్లు దాటకూడదంటూ విద్యార్థుల హాజరు కచ్చితంగా 75 శాతం హాజరు ఉండాలంటు షరతులు పెడుతూ పాఠశాల అభివృద్ధికి రూ.2వేలు కోత విధించడం సిగ్గుచేటన్నారు. కొంతమందికైతే సాంకేతిక సమస్యలంటూ ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం చదువుకునే ప్రతి ఒక్క విద్యార్థికి ఎలాంటి షరతులు లేకుండా తల్లికి వందనం పథకాన్ని వర్తింపచేసి రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులను కలుపుకొని నిరసనలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు హరీష్, జయరాం టౌన్ కమిటీ సభ్యులు కార్తీక్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మరువలేని వ్యక్తి టంకాల బాబ్జి

(సత్యంన్యూస్, నరసన్నపేట)

మరువలేని వ్యక్తి టంకాల బాబ్జి అని మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆయన జయంతి, వర్ధంతి (ఒకేరోజు ) సందర్భంగా శుక్రవారం నరసన్నపేటలో ఆయన విగ్రహానికి కృష్ణదాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సేవలు గుర్చి కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళీధర్, నాయకులు చింతు రామారావు, కె.సిహెచ్.బి.గుప్త. టి.జోగారావు, పొట్నూరు నీలం, ఉప్పు లింగరాజు, ఇట్రాజు సూరిబాబు, సదాశివుని క్రిష్ణ, ధర్మాన జగన్, బుద్దాల, రాజశేఖర్ కె.సిమ్మయ్య, పట్ట కరెన్న, డి.రమేష్, ఎస్.రామారావు, బి.ఎల్. శర్మ. టంకాల గౌతమ్, ఎస్. వి. సి. టి. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## డీజీపీ దృష్టికి బ్లాక్ మెయిల్ బాగోతం

(సత్యంన్యూస్, పలాస)

నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆసరాగా చేసుకుని కొంతమంది లబ్ధి పొందేందుకు కుట్రలు చేస్తున్నారని, పలు శాఖల అధికారులను బెదిరిస్తూ ఆర్థిక ప్రయోజనం పొందాలని కుయుక్తులు పన్నుతున్నారని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా దృష్టికి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తీసుకెళ్లారు. అమరావతిలోని డీజీపీ కార్యాలయంలో గురువారం కలసి పలు ఆధారాలను ఆయనకు సమర్పించారు. బ్లాక్‌మెయిళ్లకు లొంగనివారిపై పలు శాఖల అధికారులకు తప్పుడు సమాచారం ఇవ్వడం, కక్షపూరితంగా వ్యవహరిస్తున్న వారి జాబితాను ఇప్పటివరకు వారు చేసిన అక్రమాల వివరాలను అందజేశారు. సానుకూలంగా స్పందించిన డీజీపీ తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.





## మమితాతో లవ్‌స్టోరీ కావాలంటున్న ఫ్యాన్స్!

ప్రేమలు సినిమాతో యూత్ ఆడియన్స్‌లో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది మలయాళ భామ మమితా బైజు. అంతకున్ముందు ఐదారేళ్లుగా సినిమాలు చేస్తున్నా కూడా ప్రేమలుతో అమ్మడి టాలెంట్ సౌత్ ఆడియన్స్‌కి నచ్చేసింది. యూత్ ఆడియన్స్ అయితే మమితా పేరు వింటే చాలు ఊగిపోతున్నారు. ప్రేమలు తెలుగులో కూడా మంచి ఫలితాన్ని అందుకుంది. ఐతే ప్రేమలు తర్వాత అమ్మడు కోలీవుడ్ లో ఆల్రెడీ సినిమాలు చేస్తుంది. ఇప్పటికే రెడు సినిమాలు చేసింది మరో రెండు సినిమాలు సైన్ చేసింది.

తెలుగులో మైత్రి మేకర్స్ చేస్తున్న డ్యూడ్‌లో ప్రదీప్ రంగనాథ్‌తో జత కడుతుంది మమిత. ఐతే లేటెస్ట్‌గా సూర్య వెంకీ అట్లూరి సినిమాలో కూడా అమ్మడు అవకాశం దక్కించుకుంది. ఐతే మమితాకు యూత్‌లో ఉన్న ఫాలోయింగ్ తెలుసు కాబట్టి ఆమెను యూత్‌ఫుల్ ఎంటర్టైనర్స్, లవ్‌స్టోరీస్‌లో తీసుకోవాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. మమితాతో వెరైటీ లవ్‌స్టోరీస్ చేస్తే చూడాలని కోరుతున్నారు. అది కాకుండా ఆమె కమర్షియల్ సినిమాల్లో నటిస్తే అంతగా స్కోప్ దొరకదని వాళ్ల ఆలోచన.

ఒక విధంగా అది నిజమే అని చెప్పొచ్చు. మమితా లాంటి టాలెంట్ క్యూట్ హీరోయిన్‌తో డిఫరెంట్ డిఫరెంట్ లవ్ స్టోరీస్ చేస్తే బాగుంటుంది. అలా కాకుండా ఆమెకు స్టార్ సినిమాల్లో కేవలం పాటల వరకు వచ్చి వెళ్లే హీరోయిన్‌లా తీసుకుంటే మాత్రం తప్పకుండా రివర్స్‌లో రిజల్ట్ ఉంటుంది. మమితాను ఆడియన్స్ ఒక లవ్‌స్టోరీ హీరోయిన్‌గా చూడాలని ఆసక్తిగా ఉన్నారు. అందుకే అలాంటి కథలకే ఆమెను తీసుకుంటే బెటర్ అంటున్నారు. కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్‌గా చేస్తే క్రేజ్ రాదా అంటే వస్తుంది కానీ అది సరైన పాత్ర పడినప్పుడు మాత్రమే అలా కుదురుతుంది. అలా కాకుండా కేవలం పాటల వరకే హీరోయిన్ అనేలా ఉంటే మాత్రం మైతా వల్ల సినిమాకు ప్లస్ అవ్వడం అటుంచితే మైనస్ అవుతుంది. ఈ విషయంలో మమితా కూడా ఆడియన్స్ లో తనకున్న ఫాలోయింగ్ గుర్తించి సినిమాలు ఎంపిక చేసుకుంటే బెటర్ అని అంటున్నారు. సూర్యతో చేస్తున్న సినిమాలో ఆమె పాత్ర ఎలా ఉంటుందో కానీ ప్రదీప్‌తో చేస్తున్న డ్యూడ్‌లో యూత్ ఆడియన్స్‌కి మరోసార్ కిక్ ఇచ్చే రోల్ ఉంటుందని అంచనా వేస్తున్నారు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

## బులుగు సముద్రంలో బికినీ షో

తెలుగులో ఆకాష్ పూరి "మెహబూబా" చిత్రంలో నటించింది నేహా శెట్టి. ఆ తర్వాత టిల్లు స్క్వేర్‌లో తన అల్లరి పాత్రతో మరింత పాపులరైంది. నేహా శెట్టి అందచందాలు, నట ప్రతిభకు యూత్ ఫిదా అయిపోయారు. నిజానికి నేహాశెట్టి మంగుళేరు అమ్మాయి. మరోవైపు సోషల్ మీడియాలో నేహా శెట్టి నిరంతర పోస్టులు యువతరాన్ని ఆకర్షిస్తున్నాయి. నేహా సముద్ర విహార యాత్రలో ఉన్న కొన్ని ఫోటోలు వీడియోలు ఇంటర్నెట్ లో వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోగ్రాఫ్స్‌లో నేహా స్టన్నింగ్ బికినీ లుక్స్‌తో మతులు చెడగొడుతోంది. - తుపాకి.కామ్ సౌజన్యంతో...



## గోపీచంద్‌కు కరెక్ట్ హిట్ పడినట్టే!!

టాలెంట్ ఉన్న హీరోల్లో గోపీచంద్ ఒకడు. యాక్షన్ కథలు బాగా నప్పుతాయి. కథల ఎంపికలో చాలా క్లియర్‌గా ఉంటాడు. కానీ సరైన హిట్లే అందుకోవడం లేదు. గోపీచంద్ ఓ సాలిడ్ హిట్ కొట్టి చాలా కాలం అయ్యింది. ఇప్పుడు సంకల్ప్ తో ఓ సినిమా చేస్తున్నాడు. శ్రీనివాస చిట్టూరి నిర్మాత. ఈ రోజు గోపీచంద్ పుట్టిన రోజు సందర్భంగా చిన్న గ్లింప్స్ విడుదల చేశారు. ఈ గ్లింప్స్ లో గోపీ లుక్ బాగుంది. తనో వారియర్‌గా కనిపించబోతున్నాడన్న విషయం స్పష్టమైంది. తన ఆహార్యానికి సరిపోయే పాత్ర ఇది. గోపీచంద్‌కు చాలా కాలం తరవాత సరైన కథ పడినట్టు అనిపిస్తోంది. ఈ సెటప్, గెటప్.. ఇవి రెండూ గోపీచంద్ కు కొత్తే. సంకల్ప్ కొత్త తరహా కథలు రాస్తుంటాడు. ప్రతీసారీ ఓ కొత్త జోనర్ టచ్ చేస్తుంటాడు. ఈసారి కూడా గోపీచంద్ కోసం అలాంటి కథే ట్రై చేస్తున్నాడు. వీఎఫ్ఎక్స్ కి పెద్ద పీట వేసిన సినిమా ఇది. వార్ ఎపిసోడ్స్ హైలెట్ కాబోతున్నాయని తెలుస్తోంది. ఇటీవల ఈ తరహా కథలకు మంచి గిరాకీ ఏర్పడింది. పాన్ ఇండియా మార్కెట్ ఓపెన్ అయ్యింది. అందుకే గోపీచంద్ కూడా ఈ బాటలో నడవడానికి ఫిక్సయ్యాడు.ఇటీవలే షూటింగ్ మొదలైంది. కొంత మేర చిత్రీకరణ జరిగింది. అవుట్ పుట్ పై గోపీచంద్ పూర్తి సంతృప్తితో ఉన్నాడని తెలుస్తోంది. టైటిల్ తోనే గ్లింప్స్ వదలాలని చిత్రబృందం భావించింది. కానీ ఈ సినిమా కోసం సరైన టైటిల్ ఇప్పటి వరకూ దొరకలేదట. ఈ సినిమా కాన్సెప్ట్ ఏమిటన్న విషయంలో చిత్రబృందం ఇంకా గోప్యం పాటిస్తోంది. టీజర్, ట్రైలర్ ఎలాగూ వస్తాయి కదా, అప్పటి వరకూ ఎదురు చూడాల్సిందే.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో..





నేడు అందుబాటులోకొచ్చిన సాంకేతికతకు రూట్ మ్యాప్ చూసుకోవడానికి పేపర్ అక్కర్లేదేమోగానీ జీపీఎస్ అందుబాటులోకి రాని ఆ రోజుల్లో.. ఓ పేపరే దారిదీపమైన పరిస్థితుల్లో ఓ విమానంలో నుంచి ఆ రూట్ మ్యాప్ పేపర్ జారి కిందపడితే..? ఆ విమానంలో మన మొట్టమొదటి రాష్ట్రపతి, రాజ్యాంగసభ అధ్యక్షుడైన డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ వంటి హేమాహేమీలుంటే ఇంకేంటి పరిస్థితి..? అవునూ, అలాంటి ఒక చరిత్రలో మనం చూడని ఉత్కంఠ రేపే ఓ చాప్టర్‌లోకి వెళ్లొద్దాం.

# ఆ దంపతులు నడిపితేనే...

# నాటి రాజకీయ ప్రముఖులు విమానాలెక్కేది!

## జంట పైలట్ల సుందరమైన కథ ఇది!

ఇవాళ మనం సైకిలో, సైకిల్ మోటరో పొడైపోతే.. డకోటా బండి అని ఆట పట్టిస్తుంటాం. కానీ, రెండో ప్రపంచ యుద్ధ కాలంలో ఉపయోగించిన సైనిక రవాణా విమానం పేరు డకోటానే. ఆ డకోటా విమానంలోనే 1947లో బాబు రాజేంద్రప్రసాద్‌తో పాటు, పలువురు ప్రముఖులు ప్రయాణిస్తున్నారు. మిస్టర్ వి.సుందరం, మిసెస్ ఉషా సుంద రం ఈ దంపతులిద్దరూ పైలెట్సే. భర్త వి.సుందరానికి భార్య ఉషా సుందరం కో–పైలెట్ గా డకోటా విమానం నడుస్తోంది. తిరుచ్చి నుంచి త్రివేం ద్రకు వెళ్లుతున్న సమయంలో ఉషా సుందరం చేతుల్లో ఉన్న రూట్ మ్యాప్ కిటికీకున్న చిన్న పగుళ్లలోంచి జారి కింద పడిపోయింది. ఓవైపు వాతావరణమంత అనుకూలంగా లేదు. ఇంకోవైపు, త్రివేంద్రంలో ఎలాంటి సిగ్నల్స్ గురించి చెప్పే రేడియో స్టేషన్ సౌకర్యాలూ లేవు. కానీ, అదృష్టవశాత్తూ వారు తమ డకోటా విమానాన్ని కేప్ కొమోరిన్ అనే తీరప్రాంతంలో ఓవైపు భీకరంగా వీస్తున్న గాలులు, ఉరుములు, మెరుపుల మధ్య మెల్లిగా ల్యాండ్ చేయగల్గారు. ఈ విషయాన్ని మిస్టర్ సుందరం తన ఆటోబయోగ్రఫీ యాన్ ఎయిర్ మ్యాన్స్ సాగాలో పేర్కొన్నారు.

పిస్టన్ ఇంజన్స్, మ్యానువల్ నియంత్రణల కాలంలో, అదీ భారతదేశం తన అధికారికంగా ప్రయాణించే విమానాల కోసం ఇంకా విదేశాలపైనే ఆధారపడ్డ రోజుల్లో సుందరం దంపతులు యూకే నుంచి చెన్నై వరకూ 27 గంటల పాట దేశాల సరిహద్దులు దాటుతూ ప్రయాణించి రికార్డ్ నెలకొల్పారు. బ్లూక్రాస్ ఇండియా సహ వ్యవస్థాపకుడైన చిన్నికృష్ణకు తల్లిదండ్రులే ఈ సుందరం దంపతులు. స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా సుందరం దంపతుల జంట ఎన్నో సాహసోపేతమైన ప్రయాణాలను చేసింది. జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ తో కలిసి భారత ఉపఖండమంతా ప్రయాణించింది ఈ జంట. అప్పుడే ఏర్పడిన పాక్ లోనూ పర్యటించిన ఈ సుందరం దంపతుల జంట తాము పైలట్లుగా.. భారతదేశ కీలక జాతీయ నాయకులు, రాష్ట్రపతులు, ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రుల వంటివారిని తమ విమాన డ్రైవింగ్ లో పైలట్లుగా తిప్పడం సుందరం దంపతులకు మాత్రమే ఇప్పటి వరకూ దక్కిన అరుదైన ఘనత. భారత్ యూనియన్‌లో తమ రాజ్యాలను కలపాలంటూ ఆనాడు సర్దార్ వల్లభాయ్ పటేల్ 300 సంస్థానాలకు వెళ్లి ఆనాటి రాజులను కలిసే క్రమంలోనూ సుందరం దంపతులు పైలట్లుగా వ్యవహరించారు. ఆసమయంలోనే భారతీయత గాల్లో రెపరెపలాడాలని పటేల్ సదరు పైలట్లలో దేశభక్తి నూరిపోసేవాడట. ఈ విషయాల్ని వారి కుమారుడు 80 ఏళ్ల సురేష్ సుందరం వెల్లడించారు. తన తల్లిదండ్రులు అసలు కనీసం మ్యాపింగ్ చేయని ప్రాంతాల్లో ల్యాండ్ అయ్యారని.. వాతావరణ పరిస్థితులను అంచనా వేసి కొత్త కొత్త మార్గాలను అన్వేషించేవారని.. ఎవరూ ప్రయాణించని తీరులో పైలట్లుగా వారి ప్రస్థానం సాగిందంటారాయన.

అలాగే, యూకే నుంచి తీసుకొచ్చే డి హావిలాండ్ డోవ్ ఎయిర్ క్రాఫ్ట్ ను అప్పటి మద్రాస్ ప్రభుత్వానకందించే క్రమంలో కూడా అదొక ఐకానిక్ జర్నీగా పేర్కొన్నారు సుందరం తన బుక్‌లో. యూకే హెర్ట్ ఫోర్డ్ షైర్ లోని హాట్ ఫీల్డ్ విమానాశ్రయంలో ఆప్రాన్ పై పార్కింగ్ చేసి ఉన్న డోవ్‌ను చూసిన ఆ క్షణం.. విమానంలోని మధ్యభాగం ఫ్యూజ్ లాజ్‌పై మద్రాస్ ప్రభుత్వం అని రాసి, రెక్కలపై భారత త్రివర్ణ పతాకాన్ని చిత్రించి మురిసిపోయాం. ఆ ఎయిర్ క్రాఫ్ట్‌కు హనుమాన్ అని పేరు పెట్టి దాని ముందున్న ముక్కులాంటి భాగంలో రెడ్ కలర్ వేసి ముస్తాబు చేశామంటూ సుందరం పేర్కొన్నారు. ఆ సమయంలో బ్రిటీష్ పైలట్ సుందరంకు కొన్ని సలహాలిచ్చేందుకు టెస్ట్ రైడ్ నిర్వహించాక.. ఇంక నేను మీకు ఏ సలహాలు ఇవ్వనక్కర్లేదన్నాడని ఆయన కొడుకు సురేష్ సుందరం చెప్పిన మాట.

1948లో జూన్ 7వ తేదీన సుందరం పైలట్ దంపతుల జంట ఇంగ్లీష్ ఛానల్ నుంచి ఆరువేల మైళ్ల ప్రయాణాన్ని ఎయిర్ క్రాఫ్ట్‌లో ప్రారంభించింది. టౌలౌస్, జెనీవా, ఏథెన్స్, నికోసియా మీదుగా వారి ప్రయాణం సాఫీగా సాగినా.. బాగ్దాద్‌కు వెళ్లేసరికి వారు దట్టమైన పొగమంచును ఎదుర్కోవాల్సి వచ్చింది. వందగజాల ముందు వరకూ కనీసం ఏమీ కనిపించనంత దట్టమైన పొగ వారికి ఎయిర్ క్రాఫ్ట్ రైడింగ్ లో సవాలుగా మారింది. ఆ సమయంలో ముందుకెళ్తే ప్రమాదం సంభవించొచ్చన్న అంచనా వేసిన ఆ జంట.. తిరిగి హబానియాకు వెళ్లింది. సాధారణంగా అక్కడ పౌరవిమానాల ల్యాండింగ్‌కు అనుమతించరు. కానీ, అది అత్యవసర పరిస్థితని చెప్పి అక్కడ ల్యాండ్ చేసుకోవాలని యోచించినట్టు భార్యాభర్తలుగా పైలట్స్ ఉద్యోగాల్లో తమ అనుభవాలను సుందరం రాసుకొచ్చారు. ఆ సమయంలో అక్కడి రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ ఎయిర్ ఫోర్స్ అధికారులు వారి ఎయిర్ క్రాఫ్ట్ సులభంగా దిగేందుకు ఆయిల్ బ్యారెల్స్‌తో మార్క్ చేశారు. అలా ఇరాక్ లోని ఎయిర్‌ఫీల్డ్‌లో దిగిన సుందరం దంపతుల జంట.. ఆ తర్వాత షార్జాకు పయనమైంది. కానీ, షార్జాకు వెళ్లేటప్పుడు కూడా తీవ్రమైన దుమ్ము తుఫాన్‌ను ఎదుర్కోవడంతో.. వారు ఐదొందల అడుగుల ఎత్తులో తమ ఎయిర్ క్రాఫ్ట్‌ను ల్యాండ్ చేయాల్సి వచ్చింది. అలాంటి సవాళ్ల మధ్య ఆ జంట బతికి బట్ట కడుతుందా, లేదా అన్న అనుమానాలు, ఆందోళన నెలకొన్న సమయమది. కానీ, మిస్టర్ అండ్ మిసెస్ సుందరం ఇద్దరూ కూడా వారం రోజుల తర్వాత మద్రాస్ చేరుకున్నారు. విజయవంతంగా తిరిగివచ్చిన ఆ జంటకు హీరోల్లాంటి స్వాగతమందింది.

తన తల్లి పైలట్‌గా ఎయిర్ క్రాఫ్ట్‌ను సమర్థవంతంగా నడపగలదనీ.. అలాగే కో–పైలెట్‌గా కూడా మారి సహకరించగలదనీ.. అవసరమైనప్పుడు ఫ్లైట్ అటెండెంట్ పాత్రను కూడా పోషించిందంటారు మిసెస్ ఉషా సుందరం కూతురు అమెరికాలో జర్నలిస్టైన విజి.ఉష తన భర్త సుందరం ప్రోత్సాహంతో 22 ఏళ్లకే విమానయాన శిక్షణలో తర్ఫీదు పొంది లైసెన్స్ కూడా సాధించేసింది. కొంతకాలం కో పైలెట్‌గా భర్తతో పాటు పనిచేసిన ఉష.. కొద్దికాలానికే సోలో పైలెట్‌గా విమానాలను నడపడం మొదలుపెట్టారు. ఉష సోలోగా పైలెట్ గా ప్రయాణించడాన్ని ఆమె తల్లిదండ్రులతో షేర్ చేసుకోవాలనుకున్న అల్లుడు సుందరం ఓ టెలిగ్రామ్ పంపించాడు. అందులో usha did solo అని రాద్దామనుకున్న సుందరం పొరపాటున usha died solo అని టెలిగ్రామ్ చేయడంతో అది కొద్దికాలం ఆ కుటుంబంలో గందరగోళానికీ దారితీసింది.

సుందరం, ఉషా సుందరంకు పెళ్లి తర్వాత ముగ్గురు పిల్లలు పుట్టారు. దాంతో ఉష ఇక భర్తతో కలిసి సాహసయాత్రలన్నింటిలోనూ భాగస్వామి కాలేకపోయింది. ఆ సమయంలో సుందరం ఒంటరిగానే కలకత్తా నుంచి గౌహతికి సర్దార్ పటేల్ తో కలిసి ఒంటరి ప్రయాణానికి సిద్ధమయ్యాడు. అలా అప్పటి తూర్పు పాకిస్థాన్.. ఇప్పటి బంగ్లాదేశ్ మీదుగా ప్రయాణించాల్సి వచ్చింది. కానీ, అది శత్రుభూభాగం కావడంతో సుందరం కాస్తా ఆందోళనకు గురయ్యారు. ఏ ఏమవుతుంది పాకిస్థాన్ పైనుంచి వెళ్లితే.. వారి దేశాన్నీ చూసినట్టుంటుంది పోనీయ్ అన్న సర్దార్ పటేల్ మాటతో నాటి తూర్పు పాక్ మీదుగా ప్రయాణించాల్సి వచ్చింది. సుందరం ఆందోళనకు భిన్నంగా అప్పుడు ఢాకా నుంచి ఓ వైర్‌లెస్ సమాచారమందింది. సర్దార్ పటేల్‌కు పాక్ ప్రభుత్వం, ప్రజల తరపున స్వాగతమన్నది ఆ సందేశం.

పైలట్ గా సుందరం ఎదుర్కొన్న సవాళ్లెన్నో ఇలా మనకు ఆయన పుస్తకంలో కనిపిస్తాయి. 1947, ఆగస్ట్ లో అది దేశ విభజన సమయం. శరణార్థులను కాపాడే క్రమంలో డకోటా విమానాలున్నా.. అవి నడిపే సుశిక్షితులైన పైలట్స్ లేరు. ఆ సమయంలో శరణార్థులు కొందరు తమను భద్రంగా సురక్షిత ప్రాంతాలకు తీసుకెళ్తే వజ్రాలు, బంగారం వంటివీ ఇవ్వడానికీ ముందుకొచ్చినట్టు ఆయన ఆటోబయోగ్రఫీ చెబుతోంది. ఆ సమయంలో సుందరం బాంబేకు చెందిన మిస్త్రీ ఎయిర్ వేస్ కు తన సేవలనందిస్తున్నాడు. పాకిస్థాన్ లోని పంజాబ్ ప్రావిన్స్ లో ముల్తాన్ వరకూ ముంబై నుంచి వెళ్లి అక్కడి నుంచి శరణార్థులను తరలించడం సుందరం టాస్క్. అలా VT-AYZ అనే డకోటా ఫ్లైట్ పట్టుకుని బయల్దేరాడు. ఒక ఫ్లైట్ లో 30 మంది కంటే ఎక్కువమందిని తీసుకురారాదు. కానీ, సుందరం అప్పటికే ఫ్లైటెక్కిన 28 మందికి తోడు.. రిస్క్ తీసుకుని మరో 40 మంది ప్రయాణీకులను తీసుకొచ్చాడు. ఆ సమయంలో ఆ ఫ్లైట్ ఏకంగా ఓ రైల్లోని జనరల్ బోగీల తరహాలో.. నేలపై, సీట్లపై, టాయిలెట్స్ లో కూడా ఇరుక్కుపోయి జనం వలస వచ్చారు. అలా పదివేల పౌండ్ల అధికబరువున్నప్పటికీ సురక్షితంగా ఆ శరణార్థులందరినీ జోథ్ పూర్ కు తీసుకొచ్చారు సుందరం.


అలా సుందరం తీసుకొచ్చిన శరణార్థుల్లో ఓ వృద్ధుడుండగా.. అతడి భార్య, ఆరుగురు పిల్లలు తీసుకొచ్చిన లగేజ్ ఇవ్వడానికి విమానయాన నిబంధనలు ఒప్పుకోలేదు. కానీ, ఆ లగేజ్ లో ఉన్న బట్టల్ని, ఇతర సామాన్లను పడేసి.. కేవలం కట్టుబట్టలతో వచ్చినందుకు అందులో ఉన్న లక్ష రూపాయల కట్టను, ఇతర ఆభరణాలను మాత్రమే తీసుకోవాల్సి వచ్చింది. ఆ శరణార్థి పేరు కిషన్ చంద్ చెల్లారామ్ కాగా.. ఆ తర్వాత ఆ శరణార్థి చెన్నైలో వస్త్ర సామ్రాజ్యాన్నే నిర్మించాడు. పదవీ విరమణ తర్వాత సుందరం దంపతులిద్దరూ జంతు సంరక్షణ వైపు మొగ్గుచూపారు. ఆ క్రమంలో సహ వ్యవస్థాపకులుగా బ్లూక్రాస్ సంస్థ స్థాపనలో భాగస్వాములయ్యారు. మొత్తంగా 1996 వరకూ కూడా హుషారుగా విమానాలు నడిపి.. పైలెట్లుగా సుందరం దంపతులు సాధించిన ఫీట్స్ తో పాటు దేశంలోని ప్రముఖులతో వారు చేసిన జర్నీ.. బాబు రాజేంద్రప్రసాద్ వంటివారు ప్రయాణిస్తున్న ఎయిర్ క్రాఫ్ట్ లో జరిగిన ఉదంతాలు, ఎదుర్కొన్న సవాళ్లన్నీ ఆ పైలట్స్ కు దేశంలో ఓ ప్రత్యేక గుర్తింపునిచ్చాయి.

- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

## విమాన ప్రమాదంలో మృతులకు నివాళి

(సత్యంన్యూస్, నరసన్నపేట)


అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినవారికి సంతాపంగా నరసన్నపేట వైకాపా కార్యాలయంలో శుక్రవారం మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పాల్గొని, పార్టీ శ్రేణులతో కలిసి మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబాలకు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళీధర్, జడ్పిటిసి చింతు రామారావు, రాష్ట్ర పొందర కూరకుల కార్పొరేషన్ విభాగ అద్యక్షులు రాజపు అప్పన్న, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు కేసీహెచ్ గుప్తా, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ముంజేటి కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి రావాడ రామారావు, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు ధర్మాన జగన్, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు సురంగి నర్సింగరావు, తంగుడు జోగారావు , మండల యూత్ అధ్యక్షులు బుద్దల రాజశేఖర్, సర్పంచ్ బురల్లి శంకర్, మాజీ డైరెక్టర్ బబ్బోది ఈశ్వరరావు,సతివాడ రామినాయుడు, చింతు భీమారావు, సంతోష్, గుజ్జల అప్పలరాజులు పాల్గొన్నారు.




## పలాసలో టీటీడీ కళ్యాణ మండపం నిర్మించండి

(సత్యంన్యూస్, అమరావతి)

అమరావతిలో శుక్రవారం రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని పలాస జనసేనపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ వేగులాడ దుర్గారావు కలిసి పలాసలో టీటీడీ కళ్యాణ మండపం నిర్మించాలని వినతి పత్రం అందించారు. పలాసలో ప్రైవేటు ఫంక్షన్ హాల్ సామాన్యులు వివాహాలు, ఇతర వేడుకలు చేసుకోవాలంటే రూ.60వేల నుంచి లక్ష దాటుతుందని, పేద ప్రజలకు అందుబాటులో ఉండేలా పలాసలో టీటీడీ కళ్యాణ మండపం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు.





మండలంలోని గోవిందపురం జెడ్పీ స్కూల్, జూనియర్ కళాశాలలో శుక్రవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, మండల టీడీపీ ప్రధానకార్యదర్శి కర్ని రమణలు తనిఖీ చేశారు. పాఠశాల పునఃప్రారంభమైన నేపథ్యంలో పథకం అమలును పరిశీలించారు. సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్టు తెలిపారు. నిబంధనలు పాటిస్తూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం ఇవ్వాలని వంట ఏజెన్సీ వారికీ సూచించారు. కార్యక్రమంలో వార్డ్ నెంబర్ గణేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, వజ్రపుకొత్తూరు

## విద్యార్థి మిత్ర కిట్‌ల పంపిణీ చేపట్టిన ఎమ్మెల్యే

(సత్యంన్యూస్, రణస్థలం)

కొత్త విద్యా సంవత్సరాన్ని విద్యార్థులు ఉత్సాహంగా ప్రారంభించాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్‌లను ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వర రావు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయానికి విద్యార్థులకు బుక్స్, యూనిఫారం పంపిణీ జరగడంతో పాటు, విద్యార్థులకు కూడా నూతన విద్యా సంవత్సరం విద్యా సాధనతో నిండిన దారిని చూపుతుందని, ఇది కేవలం పంపిణీ మాత్రమే కాదని, ఇది ప్రభుత్వం విద్యకు ఎంతగా ప్రాధాన్యంగా ఇస్తోందో తెలిపే దృక్కోణం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అంతేకాకుండా విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్నం పథకానికి ప్రభుత్వం సన్నబియ్యం అందించడం గొప్ప విషయం అని, అది విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి కి ఇది ఒక తార్కాణం అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, హైస్కూల్ అధ్యాపక సిబ్బంది, మండల అధికారులు పాల్గొన్నారు.



## విమాన ప్రమాద బాధితులకు కన్నీటి వీడ్కోలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం ఎయిర్ ట్రావెల్ అసోసియేషన్ అధ్యక్షులు నటుకుల మోహన్ ఆధ్వర్యంలో విమాన ప్రమాద బాధితులకు కన్నీటి వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎయిర్ ట్రావెల్ అసోసియేషన్ సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థలు పాల్గొని స్థానిక రామలక్ష్మణ కూడలి నుండి ఏడు రోడ్ల కూడలి వరకు పాదయాత్ర చేస్తూ నివాళులు అర్పించారు. ఎయిర్ ట్రావెల్ అసోసియేషన్ సభ్యులు, నటుకుల. మోహన్ మాట్లాడుతూ గుజరాత్ లోని అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా బోయింగ్ 787–8 డ్రీమ్లైనర్ విమానం గురువారం ప్రమాదానికి గురైన విషయం తెలిసిందేనని, ఈ ఘటనలో 230 మంది ప్రయాణికులు తనువుచాలించగా, ఒక్క ప్రయాణికుడు గాయాలతో బయటపడ్డారన్నారు. ఇద్దరు పైలట్లు సహా 12 మంది సిబ్బంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, కెప్టెన్ సుమిత్ సభర్వాల్ వృద్ధాప్యంలో ఉన్న తండ్రిని కలకాలం చూసుకునేందుకు ఉద్యోగాన్ని సైతం వదలటానికి సిద్ధమయ్యే తరుణంలో ప్రాణాలు విడవటం యావత్ ప్రపంచాన్ని కలిచివేసిందన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎయిర్ ట్రావెల్ అసోసియేషన్ అధ్యక్ష బృందం, ఇతర సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# ఆరోగ్యానికి భరోసా కిమ్స్

- అధునాతన సౌకర్యాలతో ఆసుపత్రి ఆధునీకరణ
- అత్యుత్తమ వైద్యం స్థానికంగా పొందే అవకాశం
- ఈ నెల 15 నుంచి వైద్య సేవలు ప్రారంభం
- మెడికల్ డైరెక్టర్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉత్తరాంధ్ర ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించడానికి ఒక విశ్వసనీయ కేంద్రంగా కిమ్స్ నూతన రూపంలో మళ్లీ ప్రజల ముందుకు అనేక ప్రత్యేకతలతో వస్తోందని కిమ్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు అన్నారు. ఆధునీకరించిన ఆసుపత్రిలో ఈ నెల 15 నుంచి సేవలు పునఃప్రారంభం కానుండడంతో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కిమ్స్‌లో అందిస్తున్న సేవలను వివరించారు. ఉత్తరాంధ్ర ప్రజలకు ప్రపంచస్థాయి వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో కిమ్స్‌ను అత్యాధునిక సౌకర్యాలతో ఆధునీకరించి ఉన్నతమైన వైద్యసేవలతో సిద్ధంగా ఉందన్నారు. 14 ఏళ్లుగా ప్రజల నమ్మకాన్ని చూరగొన్న కిమ్స్ జిల్లా వైద్య రంగానికి నూతన దిశా నిర్దేశం కానుందన్నారు. ఒకేచోట 36 మంది వైద్య నిపుణులతో ప్రపంచ స్థాయి ప్రమాణాలు కలిగి అత్యాధునిక సాంకేతికతతో కిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులు, నర్సింగ్ సిబ్బంది, 24/7 అత్యవసర సేవలు, క్యాష్‌లెస్ హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం, కార్పొరేట్ కంపెనీలతో టై-అప్‌లు వంటి అనేక అంశాలు కిమ్స్‌ను శ్రీకాకుళంలో ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చాయన్నారు. ప్రైవేట్ రంగంలో వైద్యసేవలు పరిమితంగా ఉన్న శ్రీకాకుళంలో కిమ్స్ జిల్లా వైద్య రంగానికి ఒక పెద్ద మార్పును తీసుకురానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వైద్యం కోసం మెట్రోనగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, ప్రాణాపాయ పరిస్థితుల్లో విలువైన సమయాన్ని వృథా చేయకుండా, తక్షణమే అత్యుత్తమ వైద్యం స్థానికంగానే పొందే అవకాశం లభిస్తుందన్నారు.

### ప్రత్యేకతలు..

300 పడకల సామర్థ్యంతో అత్యాధునిక న్యూరో, నియోనాటల్, పీడియాట్రిక్, సర్జికల్ ఐసీయూలు అందుబాటులోకి వచ్చాయన్నారు. గుండె సంబంధిత చికిత్సల కోసం క్యాథ్ ల్యాబ్, ఆరు అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఆపరేషన్ థియేటర్లు, న్యూరో కోసం ఎంఆర్ఐ, సీటీ స్కాన్, ఆర్థో కోసం డిజిటల్ ఎక్స్‌రే, మామోగ్రఫీ, అల్ట్రాసౌండ్ డయాగ్నస్టిక్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. బయో కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, హిస్టోపాథాలజీ వంటి అన్ని రకాల పరీక్షలు నిర్వహించే వీలుకలిగే సమగ్ర లేబొరేటరీ అందుబాటులో ఉందన్నారు. ఐవీఎఫ్, ల్యాపరోస్కోపిక్ సర్జరీలు, జాయింట్ రీప్లేస్‌మెంట్స్ వంటి ప్రత్యేక చికిత్సలు చేయనున్నట్టు తెలిపారు. నెఫ్రాలజీ, కార్డియాలజీ, న్యూరాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ వంటి అన్ని సూపర్ స్పెషాలిటీ విభాగాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వీటితో పాటు ఫిజియో థెరపీ, డయాలసిస్, 24/7 అంబులెన్స్, ఫార్మసీ, పోషకాహార తదితర అనుబంధ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు.

### ఈ నెల 15న ప్రారంభం

కిమ్స్ ఆసుపత్రిని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభిస్తారన్నారు. విశిష్ట అతిధులుగా ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, మామిడి గోవిందరావు, నడుకుదుటి ఈశ్వరరావు, గౌతు శిరీష హాజరవుతున్నారని తెలిపారు. ప్రత్యేక అతిథిగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హాజరవుతారని, ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి రాష్ట్రస్థాయి ప్రముఖులు, వైద్య నిపుణులు, ప్రజా ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు హాజరు కానున్నారని తెలిపారు. పత్రికా సమావేశంలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ రవిసంతోష్, ఆపరేషన్స్ అండ్ క్వాలిటీ జీఎం వేదవతి, మెడికల్ సూరింటెండెంట్ సోమేశ్వరరావు, లైన్స్ ప్రతినిధి నటుకుల మోహన్, పీఆర్‌వోలు గోపి, భాస్కర్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ టీచర్ల బెట్టు..
# నిబంధనలు తీసికట్టు!

(మొదటిపేజీ తరువాయి)

నుంచి పక్కనే ఉన్న మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌కు ఒక ఉపాధ్యాయుడికి ట్రాన్స్‌ఫర్ అయింది. ఇక్కడ కూడా ఇదే పరిస్థితి తలెత్తడంతో పదోన్నతిపై వేరే చోటకు వెళ్లాల్సినవారు కదల్లేకపోతున్నారు. కేవలం ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌లో ఉన్న పాఠశాలలు, జెడ్పీ పరిధిలో ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులకే నిబంధనలు వర్తిస్తాయా? మున్సిపల్ ఉపాధ్యాయులకు వర్తించవా అన్న ప్రశ్న ఇప్పుడు తలెత్తుతుంది. ప్రధానోపాధ్యాయులకు డీఈవో పంపించిన వాట్సప్ సందేశం ప్రకారం ప్రతి పాఠశాలలోనూ ఒక సబ్జెక్ట్‌ను ప్రాతిపదికగా తీసుకొని వెనక్కు రావాల్సిన ఉపాధ్యాయులను లెక్కించాలి. ఒక సబ్జెక్టులో కనీసం ఒక ఉపాధ్యాయుడు పనిచేస్తూ ఉండాలి. ఒక పాఠశాలలో ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులు ఒకేసారి వేరే పాఠశాలకు బదిలీపై వెళ్లిన పరిస్థితుల్లో వారిలో జూనియరైన సబ్జెక్ట్ ఉపాధ్యాయుడు వెనక్కు రావాలి (ఆ ఉపాధ్యాయుడు కంపల్సరీ, రీఅపోర్షన్, సర్ప్లస్ ఏదైనా కావచ్చు). ఆ మేరకు ఒక జాబితా తయారుచేయాలని ఎంఈవోలను డీఈవో కోరారు. అయితే మున్సిపాలిటీ పరిధిలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఇప్పుడు వెనక్కు రావడానికి ససేమిరా అనడంతో పాటు రాజకీయంగా ఒత్తిడి తెస్తున్నారు. ఇందులో వీరు విజయం సాధిస్తే అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకుండాపోతారు.

## యోగాసనాలు
# జీవితంలో భాగం కావాలి

- పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణశ్రీ -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యోగాసనాలు జీవితంలో భాగం కావాలని జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణశ్రీ వెల్లడించారు. శుక్రవారం 80 అడుగుల రహదారిలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతీ రోజు ఇంటి వద్దే యోగాసనాలు వేసుకోవచ్చని, యోగాసనాలతో వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు పాండ్రంకి మురళీకృష్ణ, ఆయుష్ శాఖ నుంచి చంద్రశేఖర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ హరీష్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సిబ్బంది, నగర ప్రజలు పాల్గొన్నారు.



కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తి చేసుకుంది. నియోజకవర్గ అభివృద్ధికి రూ.600 కోట్లకు పైగా నిధులను తీసుకొచ్చామని స్థానిక ఎమ్మెల్యే పేపర్ స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. అయితే మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోను, కొత్తూరు-హిర మండలం రోడ్డులోను గుంతలను పూడ్చకపోవడం, నివగాం-మదనాపురం.. ఇలా మండల కేంద్రానికి ఉన్న కనెక్టివిటీ రోడ్లను పూర్తి చేయకపోవడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇకనైనా అధికారులు, నాయకులు స్పందించి గుంతలను పూడ్చే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- సత్యంన్యూస్, కొత్తూరు

# వందేళ్ల స్ఫూర్తి.. తరగని సేవా దీప్తి

(మొదటిపేజీ తరువాయి)

రూ.6 లక్షలు విరాళంగా ఇచ్చారు. దాంతో 2023లో సత్రానికి కొత్త భవనం సమకూరింది.

### తిరిగి వారసుల చేతికి

కాగా సత్రం నిర్వహణను తిరిగి తమకే అప్పగించాలన్న వారసుల విజ్ఞప్తిని ప్రభుత్వం మన్నించింది. ఆ మేరకు గత ఏడాది జారీ చేసిన జీవోఆర్టీ నెం. 614, తేదీ 12.9.2024 ద్వారా సత్రం నిర్వహణ అధికారాన్ని వారికి దఖలు పర్చింది. ఈ నేపథ్యంలోనే సత్రం ఏర్పాటు చేసి వందేళ్లు పూర్తి అయిన సందర్భంగా బెవర గోపాలనాయుడు మునిమనుమరాలు, ఐఏఎస్ అధికారి ఎస్. సత్యనారాయణ సతీమణి స్వర్ణశ్రీ విరాళంగా సమకూర్చిన గోపాలనాయుడు, వేణుగోపాలనాయుడు విగ్రహాలను గత నెల 28న సత్రం ఆవరణలో ఆవిష్కరించారు. ఇదే సందర్భంగా సత్రానికి విద్యార్థుల రాకపోకలు తగ్గిపోయిన ప్రస్తుత పరిస్థితుల్లో ఈ సత్రాన్ని, దాని ఆదాయాన్ని వృథా పోనివ్వకుండా పేద విద్యార్థులను స్వయం ఉపాధి దిశగా నడిపించే స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంగా మార్చేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సత్రం నిర్వాహక కమిటీ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపింది. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభిస్తామని డాక్టర్ శశిభూషణరావు తెలిపారు.

### భూములు అన్యాక్రాంతం

అన్నదాన సత్రం నిర్వహణకు దాని వ్యవస్థాపకుడు గోపాలనాయుడు 53 ఎకరాలు, తర్వాత ఆయన తనయుడు 20 ఎకరాలు ఇచ్చారు. వాటిని రైతులకు కౌలుకు ఇచ్చి.. తద్వారా వచ్చే ఆదాయంతో సత్రాన్ని నిర్వహించేవారు. అయితే దేవదాయ శాఖ స్వాధీనం చేసుకోవడం, అధికారులు పట్టించుకోకపోవడం వల్ల కౌలు వసూళ్లు నిలిచిపోయాయి. భూములు ఆక్రమణల పాలయ్యాయి. దాతలు ఇచ్చిన మొత్తం 73 ఎకరాల్లో ప్రస్తుతం 35 ఎకరాల నుంచి మాత్రమే ఎకరాకు ఐదు బస్తాలు చొప్పున కౌలు అందుతోంది. కొందరు రైతులు కౌలు చెల్లించడం మానేయగా.. కొందరు ఏకంగా భూములనే సొంతం చేసుకున్నారు. వీటిలో ఎనిమిది ఎకరాలు కోర్టు వివాదంలో చిక్కుకున్నాయి. ఈ భూములను విడిపించేందుకు కోర్టు ద్వారానే పోరాడుతున్నామని, త్వరలోనే తమకు అనుకూలంగా కోర్టు నిర్ణయం ప్రకటించవచ్చని డాక్టర్ శశిభూషణరావు ఆశాభావం వ్యక్తం చేశారు.






# కూటమిది ప్రజాభిప్రాయ పాలన

- ఎనభై శాతం హామీలు నేరవేర్చాం
- పాలన చేతకానివాళ్లే దుష్ప్రచారం చేస్తున్నారు
- తల్లికి వందనం ఏటా రూ.10వేల కోట్లు
- వైకాపా అక్రమాలను అరికడతాం
- ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలన ప్రజారంజకంగా జరిగిందని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో విధ్వంసం జరిగిందని, దానిని సరిచేస్తూ కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏడాదిలోనే వికాసానికి తెచ్చామని తెలిపారు. ఏడాది కాలంలో ఎన్నో అభివృద్ధి పథకాలను అందించామని, యువతకు 10,500 కోట్లు పెట్టుబడులు ఆకర్షించి, 6.50 లక్షల ఉద్యోగాల కల్పనకు కూటమి నాయకులు చర్యలు చేపట్టమన్నారు. 2014 రాష్ట్ర విభజన తర్వాత పాలన చేపట్టిన చంద్రబాబు 104 సంక్షేమ పథకాలను అందించారని గుర్తు చేశారు. 2019లో వైకాపా ఆ పథకాలను కుదించి 34 పథకాలు అరకొర అందించి గొప్పలు చెప్పడం సరి కాదన్నారు. వారి పాలనలో ఒక్క రూపాయి అయినా పెట్టుబడులు తెచ్చారా అని రవికుమార్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలోనే 80 శాతం అమలు చేసిందని స్పష్టంచేసారు. ప్రస్తుతం 64 లక్షల మంది తల్లుల ఖాతాలో తల్లికి వందనం 10.91 వేల కోట్ల రూపాయలు అందిస్తున్నామన్నారు. అలాగే ఉచిత మూడు గ్యాస్ సిలిండర్లు, ఈ నెల 20న రైతులకు పెట్టుబడి మద్దతు, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సర్వీసు అందిస్తామన్నారు. పరిపాలనపై అవగాహన లేకుండా సైకోలు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందించి ప్రతి హామీ నేరవేరుస్తామని తెలిపారు. గత ఎన్నికల్లో వైకాపాకు ప్రతిపక్ష స్థాయి లేకుండా ప్రజలు బుద్ధి చెప్పినా, వారి తీరు మారలేదన్నారు. ముందుగా అహ్మదాబాద్ విమాన దుర్ఘటనపై ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొదలవలస రమేష్, గోవిందరావు, కేవీ రమణ, యండ అప్పలనాయుడు, తంగి గురవయ్య తదితరులు ఉన్నారు.

# ప్రతీ సమస్యకు పరిష్కార మార్గం చూపిస్తాం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నియోజకవర్గ ప్రజల కోసం ఎమ్మెల్యే గొండు శంకర్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. నియోజకవర్గం నలుమూలల నుంచి వివిధ వర్గాల ప్రజలు, నియోజకవర్గంలోని గార, శ్రీకాకుళం రూరల్ మండలం, శ్రీకాకుళం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు విశాఖ-ఎ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకొని వినతులను శుక్రవారం అందజేశారు. ప్రతి ఒక్కరి సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపిస్తామని శంకర్ అన్నారు. కూటమి పాలనలో అందరికీ సమన్యాయం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా గత ఐదేళ్లలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడంతో పెద్ద ఎత్తున నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు అందుతున్నాయన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యం, విద్యుత్, డ్రైన్లు, సాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి వినతులు అందుతున్నాయని, వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా నిర్వహిస్తున్నామని, గత కొద్ది నెలల్లోనే ప్రజాప్రభుత్వంగా ప్రజలతో మన్ననలు అందుకున్నామని వివరించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధికి, అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని శంకర్ వివరించారు. ఇళ్లు కావాలని పెద్ద ఎత్తున వినతులు అందుతున్నాయని, రాష్ట్ర మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఒక ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.